


(రెండవభాగం)

గౌరీపతి స్టాఫ్‌రూం కొచ్చినవేళ సరిగ్గా రెండుగంటలు. అతని కప్పుడు క్లాసులేదు.

నిర్లిప్తంగా కుర్చీలో కూర్చుని కాళ్ళు ఆరజాపాడు. చేతిలోవున్న పదిహేను పైసల కవర్ను టేబిలుమీదుంచి గాజురాయిని దానిమీద బరువుగా వుంచాడు. సీలింగు ఫాన్ గిరగిర తిరుగుతోంది.

గౌరీపతి కొన్నిక్షణాలు కళ్ళు మూసుకొన్నాడు.

—టేబిల్ మీదున్న కవర్ను చేతిలోకి తీసుకొని అందులోని కాగితాన్ని బయటకు తీశాడు.

మరోసారి అతనికళ్ళు ఆ కాగితంమీద రాసున్న అక్షరాలమీదకు పరుగుతీశాయి.

వైజాగ్,
15–4–68

డియర్ గౌరీపతి,

చాలాకాలం తర్వాత నేను రాస్తున్న లెటర్ని చూసి నువ్వు ఆశ్చర్యపడతావను కొంటాను.

గౌరీ! కొన్ని కారణాలచేత రాస్తున్నాను. ప్రస్తుతం నా పరిస్థితి ఏమీ బాగాలేదు. నా బతుకు రోజుల్లోవుంది. ఏక్షణంలో పోతానో అనే భయంచేత రాస్తున్నాను. ప్రతిక్షణం నువ్వే గుర్తొస్తున్నావు. నిన్ను చూడాలని ఆరాటంగా వున్నది.

ప్లీజ్, ఒక్కసారి వస్తావుకదూ?

నిన్నుచూసి మనసారా కళ్ళుమూస్తాను. నా ఈ తుదికోర్కె తీర్చు గౌరీ.

ఇంతకుమించి ఏం రాసేది?

నీ రాకకోసం కళ్ళల్లో వత్తులుంచుకొని ఎదురు చూస్తుంటాను.

నీ
మేరీ.

కాగితాన్ని మడిచి కవర్లో పెడుతూ తలెత్తి చూసేడు గౌరీపతి.

పక్కనే చిరునవ్వుతో సోమయాజులు నించుని వున్నాడు. గౌరీపతి కళ్ళలోకి చూసి భుజం తట్టేడు.

—సాయంత్రం అయిదుగంటలు అవు

తోంది. గౌరీపతి సైకిల్ దిగి దాన్ని వరండాలో వుంచి ఇంటిలోపల అడుగుపెట్టాడు.

శారద లోపలగదిలో వున్నట్టుంది. అతని రాకతో గబగబ వంటగదికి వెళ్ళిపోయింది.

గౌరీపతి బట్టలు విప్పి టవల్ తీసుకొని స్నానాలగదిలోకి నడిచేడు. మొహం కడుక్కొని హాల్లో కొచ్చేసరికి కాఫీ కప్పుతో నించునుంది శారద. అతను కాఫీ కప్పును అందుకొంటూ శారద మొహంలోకి చూశాడు.

శారద కాస్తంత ఆశ్చర్యపోయింది!

గౌరీపతి విసుగుతో కూడిన మాటలేవీ అనకపోవడంచేత శారదకు 'కొత్తదనం' అనిపించింది.

గౌరీపతికి బయటకెళ్ళ మనసు కాలేదు. పైజమా, షర్టు వేసుకొని ఈజీఛైర్లో కూర్చున్నాడు. సిగరెట్టు వెలిగించి పొగని దట్టంగా వదులుతున్నాడు. విశ్రాంతి తీసుకోవల్సిన ఆ సమయంలో అతని బుర్ర ఆలోచనలతో సతమతమవుతోంది.

మేరి చావుబతుకుల్లో వున్నది!

గంపెడాశతో—అదీ ఆఖరుసారి తనని చూడాలని రమ్మని రాసింది.

'వెళ్ళి చూసిరావాలి' అవుతే అదెలా సాధ్యం?

శారదని పెళ్ళి చేసుకొన్నాకమేరీ దగ్గరకెప్పుడూ వెళ్ళలేదు. వెళ్ళకూడదనే అనుకున్నాడు.

కనీసం వుత్తరాలుకూడా రాసుకోలేదు.

'మేరీని ఇప్పుడెళ్ళి చూడకపోతే?'

మేరీ పరిస్థితి అయోమయంగా వుండే రాసుంటుంది. మేరీ చచ్చిపోతుంది. తనని చూడలేదన్న అశాంతితో చచ్చిపోతుంది. ఆపాపం తనకి కొడుతుంది. ఎన్నో ఆశలు కలలు కల్పించి, గాఢంగా ప్రేమించిన ప్రియురాలి కడసారి కోర్కె తీర్చలేని తనదీ ఓ బతుకేనా?

మేరీ తనని పలవరిస్తూ ప్రాణాలు వదులుతుంది.

గౌరీపతి మరో సిగరెట్టు వెలిగించేడు.

మేరీదగ్గర కెళ్ళిచూసి వచ్చేందుకు అతని మనసు అంగీకరించడం లేదు తనని నమ్ముకొన్న శారద కన్యాయం చెయ్యలేడు. పెళ్ళయిన తర్వాతకూడా మేరీగురించి ఆలోచనలు వచ్చినా మనసులోనే బాధపడేవాడు మినహాయించి శారదకవేం చెప్పలేదు చెప్పలేడు.

[అయ్యో శారదా! నేన్నీకన్యాయం చేశాను. నన్ను క్షమించు. నీకు చాతనవుతే ఈ రాస్కెల్‌గాడిని చంపిపారేయి. నిన్ను ప్రతిక్షణం కాల్చుకు తింటూన్న రాక్షసిన్నేను— ముక్కలుగా కొట్టేయి.

అంతకుమించి శిక్షలేదు.

మేరీ చచ్చిపోయే స్థితిలో వుంది.

వెళ్ళి చూసి వచ్చేదా? అవుతే ఎలా వెళ్ళేది?

మేరీ దగ్గరకెళ్ళి నీ కింతకంటేనూ అన్యాయం చెయ్యమంటావా?

చెప్పు శారదా చెప్పు.]

గౌరీపతి కళ్ళలో నీరు తిరిగింది.

మెల్లగా డ్రాయర్ దగ్గరకు నడిచేడు. డ్రాయర్ పొరుగులాగి అందులోనుండి ఫోటో ఆల్బం తీశాడు.

మొదట్లోనే ఓ దేవత దర్శనమిచ్చింది!

ఆ దేవత ఒకనాడు గౌరీపతి హృదయానికి రాణి. ఆ రాణి అతని హృదయాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలింది.

కొన్ని క్షణాలు ఆ ఫొటోవంక చూస్తుండి పోయాడు అతను.

[లేదు మేరీ! ఈ గౌరీపతిని నువ్వింకా గుర్తుంచుకొన్నావేమోగాని ఈ రాస్కెల్ గాడు నిన్నెప్పుడో మర్చిపోయాడు.

ఇప్పుడు నువ్వెవరో? నేనెవరో? ఇక ముందుకూడా అంతే!

గతాన్ని తలుచుకోకు. దయచేసి నాకూ దాన్ని గుర్తుచేయకు. నాది అతి సున్నితమైన గుండె. దానికష్టాన్ని భరించేంత శక్తిలేదు. గతం గుర్తుకొస్తే నా కేడుపొచ్చి, నా గుండె పగిలిపోతుంది.

ఒద్దు మేరీ ఒద్దు! నన్నిలా బతకనీయ్.

నీకు తెలీదేమోను, నేనిప్పుడు చాలా మారిపోయాను. నేనిప్పుడు పూర్వం గౌరీపతిని కానేకాదు.]

* * *

కిటికీదగ్గరకు నడిచాడు.

గోడ గడియారం ఏడుగంటలు కొట్టింది. బయట సన్నని చినుకులు పడుతున్నాయి. ఆకాశంనల్లగా కాటుక ముద్దలా తయారైంది. మధ్య మధ్య మెరపులు మెరుస్తున్నాయి. చెట్లు గాలికి వూగుతున్నాయి.

మనిషి జీవితంలో మార్పులా వాతావరణంలో క్షణాల్లో మార్పు వస్తోంది. జోరుగా వర్షం సాగింది:

వీధిదీపాలు పోయాయి. కిటికీ రెక్కలు వేసి వెనక్కు తిరిగాడు గౌరీపతి.

శారద గుమ్మంలో నించునుంది.

అతనేం మాట్లాడలేదు.

'వర్షం వస్తోంది', శారద అన్నది.

'అవును,'

'భోజనానికి రండి,'

అతను వెళ్ళి టేబిల్‌ముందు కూర్చున్నాడు. శారద వడ్డిస్తోంది. ఆమెవంక చూశాడు. శారద దిగులుగా కనుపించిందతనికి.

ఉరుము వురిమింది.

శారద వులిక్కి పడింది. భర్తముందు సిగ్గుపడ్డందుకు కొంచెం సిగ్గుపడింది.

అతను మౌనంగా భోజనం చేస్తున్నాడు. ఆమె చీరకొంగును వేలికి ముడివేస్తూ గోడకు ఆనుకొని నించునుంది.

కంచంలో చెయ్యి కడుక్కొని గదిలోకి వచ్చేసేముందు ఓసారి వెనక్కితిరిగి శారద వంక చూసేడు. అతనివైపే అమాయకంగా చూస్తోన్న ఆమె తన చూపుల్ని మరల్చుకొంది,

[నీ అమాయకపు చూపులతో నన్ను చంపేస్తున్నావు శారదా!

నువ్వు నిజంగా మంచిదానివి. నిన్ను మొదటిరాత్రే పూర్తిగా చదివేను.

కానీ నిన్ను సుఖపెట్టలేక పోతున్నాను.

అందుకు పైన దేవుడున్నాడు.

వాడంతా చూస్తూనే వుంటాడు.

ఆ న్యాయమూర్తికోరోజున నేను సంజాయిషీ ఇచ్చుకోవాలి. నేను చేస్తున్న పాపాన్ని ఒప్పుకోవాలి. తలొంచాలి. తప్పదు.

ఆల్‌రైట్, నేనో నిశ్చయానికి వొచ్చాను. నేన్నీకి రోజు నిజం చెప్తేస్తాను. అంతే!]

గదిలోకి వెళ్ళి మంచంమీద వాలాడు.

గదిలో జీరో వాట్సులైటు తన కాంతిని అధికం చెయ్యాలని ప్రయత్నిస్తోంది.

తల కణతలకి అమృతాంజనం రాసుకొన్నాడు,

కణతలని సవరించుకొంటున్న సమయంలో శారద గదిలోకి పాలగ్లాసుతో వచ్చింది.

# నీలాంటి ఒకరు...

'శారదా!' పిలిచాడు.

ఆ పిలుపులోని మెత్తదనానికి ఆశ్చర్యపోయిందామె. పరుగునవెళ్ళి అతని కౌగిట్లో కరిగిపోవాలన్నంత ఆవేశం వచ్చింది శారదకు.

'శారదా!'

'...ఊఁ' అంది జీరబోయిన గొంతుతో.

'నీకో విషయం చెప్పేదా?'

'చెప్పండి'

'మేరీ దగ్గర్నుండి లెటరొచ్చింది' శారదముఖ కవళికలని పరిశీలిస్తూ అన్నాడు. ఆమె అతనివంక చూస్తూ కూర్చుంది.

'మేరీ ఎవరని అడగవేం?' అన్నాడు మళ్ళీ.

'చెపుతున్నారుగదూ? వింటున్నాను'

'అంతేకాని అడిగి తెలుసుకోవాలని నీకు లేదు?'

'మీ మాటల్నెప్పుడూ గౌరవిస్తాను. నా కెక్కువగా మాట్లాడ్డంరాదు. చెప్పండి'

'మేరీ ఎవరో తెలుసుకోవాలని లేదా అంటున్నాను?'

'మీ స్నేహితురాలనుకొంటాను'

'కేవలం స్నేహితురాలే కాదు. మానాన్న అడ్డు తగిలి వుండకపోతే మేరీ నీస్థానంలో వుండేది', అని చురుగ్గా శారద కళ్ళలోకి చూశాడు. ఆదే సమయంలో శారద కళ్ళ నుండి రెండు కన్నీటిబొట్లు టప్మని రాలిపడ్డాయి.

'చెప్పు శారదా చెప్పు! నీకిప్పుడే మనిపిస్తుంది? ఈ గౌరీపతిమీద అసహ్యం వేస్తుందికదూ?' శారద భుజాలు రెండూ పట్టుకొని కుదిపేస్తూ అడిగాడు.

'లేదు',

'నేను చెప్పిందంతా నిజమేనని నమ్ముతున్నావా శారదా?'

'మీరు చెప్పింది నిజంకాదనే సాహసం నాకు లేదు. మీరేం చెప్పినా నమ్ముతాను.'

'మరవుతే మేరీ రాసిన వుత్తరం చూపించమని అడగవేం? మేరీ ఏ విషయాలు రాసిందో తెలుసుకోవాలని లేదా?

నిజానికి నువ్వు బాధపడివుండాలి. గుండె పగిలేలా ఏడ్చివుండాలి. కానీ అదేం చేయడం లేదు నువ్వు. నాముందు నటిస్తున్నావ్.'

'ఆమెగారు ఏం రాసుంటారో నేనూహించుకోగలను. మిమ్మల్ని ఓసారి రమ్మని రాసుంటుంది. లేకపోతే తనే వస్తున్నానని అయినా కావచ్చు', మెల్లగా అన్న శారద మాటలకి అతను ఆశ్చర్యపడ్డాడు

'అదేం కాదు...కావాలంటే ఈ ఉత్తరం చదువుకో', అంటూ అందించాడు.

బయట వర్షం జోరుగా సాగుతోంది!

మెరపులకాంతి కిటికీగుండా పడుతోంది. ఉరుములు అడవి సింహాల్లా గర్జిస్తున్నాయి.

టేబిల్‌మీదున్న పుస్తకంలో పేజీలు రెపరెప లాడుతున్నాయి.

'వెళ్ళి మేరీని చూసిరండి', అంది శారద ఉత్తరం తిరిగి ఇచ్చేస్తూ:

'శారదా! ఏమిటి నువ్వంటున్నది? నిజమేనా, ఎందుకలా అంటున్నావ్?'

అప్పుడు శారద అన్నది.

'ఆపదలో వున్న స్నేహితుల్ని పరామర్శించడం మీ ధర్మం. మేరీని చూసి రండి.'

'శారదా! నువ్వు నిజంగా మంచి దానివి...' అని ఇంకా ఏమో అనబోతున్న గౌరీపతి మాటలకి చలించింది శారద. అక్కడ్నుండి పక్కగదిలోకి వరుగెత్తింది.

ఆమె వింత ప్రవర్తన గౌరీపతి కర్థం కాలేదు.

[నువ్వు అతిమంచి ఆడపిల్లవి. సున్నితమైన హృదయం నీది. అనుకున్నాను గానీ నువ్వు నటించలేవు.

—నా విషయం వేరు. నేను గొప్ప నటుడ్ని. ఊసరవెల్లిని, మనిషిని చిత్రవధ చేయడం తెలిసిన కసాయివాడిని. చిత్రమైన జాతకాలు మనవి. ఐ పి టీ యూ.]

—మర్నాడు గౌరీపతి కాలేజికెళ్ళి సెలవుపెట్టాడు.

అతనక్కడ విన్నమాటలకి, అతని మనసు చివుక్కుమన్నది!

'సోమయాజులుకు హార్టుఎటాక్ వచ్చిందనీ, హాస్పిటల్లో ఎడ్మిట్ చేశారని.'

అక్కడ్నుండి హాస్పిటల్ కెళ్ళాడు.

సోమయాజులు అతి నీరసంగా అగుపించేడు. అతని తలవేపున శంకర్రావు నిలబడివున్నాడు.

సోమయాజుల్ని పరామర్శించి తను విశాఖపట్నం వెళుతున్న సంగతి చెప్పాడు.

సోమయాజులు చిత్రంగా నవ్వేడు.

'ఆవిషయం నాకుతెలుసు. విష్‌యూ హాపీ జర్నీ. మీరు తిరిగొచ్చేవేళకి నేను మామూలు మనిషినై మీకు స్వాగతంచెబుతాను'అన్నాడు సోమయాజులు.


* * *

డేవిడ్ డ్రస్ చేసుకొని గుమ్మంవరకెళ్ళి టపీమని ఆగిపోయాడు.

వెనక్కి తిరిగిచూశాడు.

రేడియో బల్లపక్కనే పేముకుర్చీలో కూర్చునివున్న మేరీ 'ఏం ఆగిపోయావ్?' అన్నట్లు చూపింది.

డేవిడ్ చేతివాచీవంక ఓసారి టేబిల్ మీదున్న అలారం టైంపీసు ఇంకోసారి



చూశాడు. టైము రెండింటిలోనూ పదికి అయిదు నిముషాలు తక్కువ చూపుతోంది.

డేవిడ్ వెనక్కు వచ్చి మేరీ ఎదురుగా వున్న మరోకుర్చీలో కూర్చున్నాడు.

'ఏం ఆఫీసుకెళ్లవా?' అడిగింది మేరీ.

'తలనొప్పిగా వుంది వెళ్లను' టేబిల్ మీదున్న పత్రికను చేతిలోకి తీసుకొన్నాడు.

'బాగానే వుంది వరస'

'చిన్న రిక్వెస్ట్' అన్నాడు

'ఏమిటి?'

'ఏం?'

'నేను సినిమాలు చూడ్డం మానేసి సంవత్సరం అవుతోంది.'

'అవును నేను మానేసీ సంవత్సరమే అవుతోంది.'


సరిగ్గా అప్పుడే ఆ ఇంటిముందు ఓ రిక్షా ఆగింది.

ఆ రిక్షాలోంచి గౌరీపతి దిగేడు.

'హల్లో,' అంటు మేరీ ఇంచుమించు పరుగెట్టుకెళ్లి గౌరీపతి చేతులు పట్టుకొంది.

గౌరీపతప్పుడు అమితంగా ఆశ్చర్య పడ్డాడు.

'...రే ఆశ్చర్యంగా వుందే! నువ్వు



బెడ్ మీదున్నావనీ, ఇక్కడేదో భయంకర మైన సీను చూడాల్సొస్తుందని భయపడి వచ్చాను. ఇదంతా ఏమిటి?'

'నథింగ్, అదంతా తర్వాత చెబుతాను. ప్రయాణం అదీ సుఖంగా జరిగిందా?', కళ్లల్లో ఆనందం నింపుకొంటూ అడుగుతూనే లోపలికి తీసుకొచ్చింది.

గౌరీపతి, మేరీ కూర్చున్నారు.

'ఏమిటి మేరీ నాటకం?' చిరుకోపం నటించేడు గౌరీపతి.

'నిన్ను చూడాలని,'

'అందుకని.........?'

'నాపేరు డేవిడ్...', అన్న మాటలకి గౌరీపతి తలెత్తి చూశాడు డేవిడ్ చేతుల్లో ట్రే వుంది.

'మా వారు', అన్నది మేరీ.

'నా పేరు గౌరీపతి', అన్నాడు కాఫీ కప్పు అందుకొంటు. మేరీ తనో కప్పు అందుకొంది.

'ఆల్‌రైట్, కాఫీ తాగింతర్వాత స్నానం చేయండి. హాట్ వాటర్ రడీగా వుంది,' అన్చెప్పి వీధి గుమ్మం వేపు నడిచాడు డేవిడ్.

'ఎక్కడికి డేవిడ్?' అడిగింది మేరీ.

'ఆఫీసుకు,' అని గబగబ మెట్లు దిగిపోయాడు.

గౌరీపతి స్నానాల గదిలోకి వెడుతూ ఆ

# నీలాంటి ఒకరు...

మాటలు విన్నాడు.

—సాయంత్రం ఆరుగంటలు దాటుతున్న వేళ డేవిడ్ ఇంటికొచ్చాడు. తలుపుకువేసి వున్న తాళం అతన్ని పరిహసించి నట్టయింది.

డూప్లికేటు తాళంచెవితో తాళం తీసి లోపలకు వెళ్లాడు.

టేబిల్‌మీద చిన్న స్లిప్పు వుంది. దాని మీద ఇలా వున్నది.

'నేనూ గౌరీపతిగారు కలిసి సినిమా కెళుతున్నాం.'

'మేరీ'

డేవిడ్ బీరువా తలుపులు తెరచాడు.

అతనికళ్లకి మేరీ డైరీ అగుపించింది.

— అదేసమయంలో :

సినిమా జోరుగా సాగుతోంది.

గౌరీపతి చేతిమీద తన చేతినుంచి సినిమా చూస్తోంది మేరీ.

'పూర్వం మనమిదే హాలుకొచ్చేం, గుర్తుందా?' అడిగింది మేరీ.

'అవును— 'గన్స్ఆఫ్ నవరోన్' కదూ?'

'అవును కరెక్టుగా చెప్పావు,'

'...........,'

'అప్పుడు మధ్యలో నిన్నేంచేశానో గుర్తుందా?' గౌరీపతిచేతిని గటిగా నొక్కుతూ అడిగింది.

గౌరీపతి మాట్లాడలేదు.

'సరిగ్గా అప్పుడూ యిల్లాగే మాటా పలుకూ లేకుండా కూర్చున్నావు.'

'సినిమా బాగోలేదు. పోదాం, లే,' అన్నాడు.

ఇద్దరూ హాల్లోంచి బయటకొచ్చేరు.

బయట చల్లని వెన్నెల కురుస్తోంది. చల్లనిగాలి వీస్తుంది.

'బీచికెళదామా,' అడిగింది.

'నీయిష్టం'

—రామకృష్ణమఠం బీచి నిర్మానుష్యంగా వున్నది. తెల్లటి వెన్నెల్లో నురగలు కుక్కుతూ ముందుకొస్తూంది సముద్రం.

గౌరీపతి, మేరీ మెత్తటి ఇసుకలో దగ్గర దగ్గరగా కూర్చున్నారు.

క్వాలిటీ రెస్టారెంట్లో లైట్లు వెలుగుతున్నాయి.

యూనివర్శిటీ గరల్స్ హాస్టల్లో లైట్లు కనబడుతున్నాయి.

మేరీ గౌరీపతివడిలో తలబెట్టుకొని పడుకొంది. గౌరీపతి రెండుచేతుల్నీ తనచేతుల్లోకి తీసుకొని ప్రేమగా తన చెక్కిళ్లకు రాసుకొంటూ కొన్ని క్షణాలు అతని కళ్లల్లోకి చూస్తూ వుండిపోయింది.

మేరీ కళ్లలో నీరు గిర్రున తిరిగింది. ఆమెకేన్నో పాతసంగతులు గుర్తుకొస్తున్నాయి.

'గౌరీ! నీకు గుర్తుందా?' అడిగింది.

'ఏమిటీ?'

'అరవైఆరు డిశంబర్లో—తేదీ ఏడు, ఇదే బీచిలోమనం...' ఇంక మేరీ చెప్పలేకపోయింది.

'అవేం గుర్తుచేయకు మేరీ. ఆ రోజులు మళ్లీ రావు. ప్రయత్నం చేయడమూ మంచిది కాదు. అంతే! పద ఇంటికెళదాం'.

ఇద్దరూ రోడ్డుమీద కొచ్చేరు.


గౌరీపతి తన కేర్పాటుచేసిన గదిలోకి వెళ్లిపోయాడు.

డేవిడ్ పెద్ద లైటార్పేసి బెడ్‌లైట్ వెలిగించేడు. పక్క మంచంమీద పడుకొని వున్న మేరీ అనవసరంగా నవ్వింది.

డేవిడ్ సిగరెట్టు వెలిగించాడు.

'మన గెస్టుమీద నీ అభిప్రాయం ఏమిటి?' అడిగింది మేరీ.

'పిచ్చివాడు', అన్నాడు డేవిడ్.



మేరీ కొన్నిక్షణాలు డేవిడ్ మొహంలోకి చూసింది.

'నీదుత్త జెలసీ; అతను మంచివాడు' అన్నది.

డేవిడ్ మాట్లాడలేదు. సిగరెట్టు కాలుస్తున్నాడు.

డేవిడ్‌కి నిద్రపట్టక గదిలో పచార్లు చేశాడు.

మేరీ మంచందగ్గరకు నడిచేడు. మేరీ నిద్రపోతోంది,

చలిగాలి వీస్తుంది.

హాల్లోకొచ్చాడు. గౌరీపతి పడుకున్న గది తలుపులు తెరచివున్నాయి.

డేవిడ్ ఓ క్షణం ఆలోచించి ఆ గది లోకి నడిచాడు.

గౌరీపతి నిద్రపోతున్నాడు.

మెల్లగా అతని దగ్గరకు నడిచాడు.

పక్కనేవున్న దుప్పటినితీసి గౌరీపతికి కప్పాడు.

తర్వాత బయటకొచ్చి తలుపులు చేరగిల వేసి తన గదిలోకి వెళ్లిపోయాడు డేవిడ్.

* * *

'చూడు డేవిడ్, గౌరీపతి వెళ్లిపోతానంటున్నాడు' అన్నది మేరీ వుదయం కాఫీ తాగేటప్పుడు.

'అవును ఈరోజు వుండండి, నిన్ననే కదా వచ్చారు' డేవిడ్.

'లేదు...వెళ్లిపోవాలి' అన్నాడు గౌరీపతి

'మీ ఇష్టం'

'రే! అదేమిటి డేవిడ్. వారు వెళ్లిపోతానంటుంటే మీఇష్టం అంటావ్' కాఫీ కప్పు టేబిల్ మీదుంచుతూ అన్నది.

డేవిడ్ తిన్నగా రేడియోదగ్గరకు నడచి ఇంగ్లీషు సిలోన్ ట్యూన్ చేశాడు.

పావెంకా పాడిన 'డయానా! ఐ లవ్‌యూ బట్ యూ లవ్‌మి' వినబడుతోంది.

గౌరీపతి మాటకి అడ్డుచెప్పలేక పోయింది మేరీ.

గౌరీపతి రిక్షా ఎక్కాడు ఆ సాయంత్రం.

మేరీ కళ్లలో నీరు గిర్రున తిరిగింది.

రిక్షా కదుల్తుండగా డేవిడ్ అదే రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

'నన్ను మర్చిపోవుకదూ?' అంది మేరీ కదిలి వెళుతున్న రిక్షాలోవున్న గౌరీపతి మద్దేసించి.

రైలు కదలడానికి సిద్ధంగా వున్నది.

గౌరీపతి కిటికీదగ్గర కూర్చున్నాడు. కండక్టర్ స్లీపర్‌కోచ్‌లో బెర్తు ఇవ్వడంచేత తేలికైంది.

రెండు నిమిషాలకి రైలు కదులుతుందనగా డేవిడ్ గౌరీపతితో అన్నాడు.

'గౌరీపతిగారూ! నన్ను మేరీఫాదర్ జోసఫ్ చదివించేడు. ఆయనే నాకీ వుద్యోగం ఇప్పించేడు.

ఆచేత్తోనే మేరీని నాకిచ్చి పెళ్లిచేశాడు.

నేను కొన్ని ఆశలమధ్యా కలలమధ్య బతుకుతున్న మనిషిని. ఆ ఆశలూ కలలూ అన్నీ మేరీ!

అలాటి నా మేరీ హృదయంలో నా స్థానానికి ఏలోపం వచ్చినా మనిషిగా బ్రతకలేన్నేను.

నా సుఖాన్ని తినే మనిషిని నేను సహించను. దయచేసి నన్ను మనిషిగా బతకనీయండి. ఇది మీ క్షేమాన్ని కోరి చెబుతున్నాను.'

రైలు కదిలింది.

* * *

మేరీ బీరువా దగ్గరకు నడిచి తలుపులు తెరచింది. తన డైరీలో క్రితం రోజు పేజీ మీద డేవిడ్ రాసిన అక్షరాలు చూసి ఆశ్చర్య పడింది.

'పిచ్చి వేషాలు వేయకు మేరీ — నేను మంచివాడిని కాదు,'

డేవిడ్.

మేరీ వెనక్కు తిరిగింది—చప్పుడైతే.

డేవిడ్ సిగరెట్టు కాలుస్తూ గుమ్మంలో నించుని వున్నాడు!

(ముగింపు పైవారం)

డాక్టర్ కబుర్లు

# త్వరగా నిర్ణయాలు తీసుకుంటే ఆదుర్దా తక్కువ

త్వరగా నిర్ణయాలు తీసుకునే వారికి మనస్సు నిలకడ ఎక్కువగా ఉంటుంది.

ఒకనిర్ణయం తీసుకొనవలసి వచ్చినప్పుడు ఆదుర్దా ఎక్కువ అవుతుంది. నిర్ణయం తీసుకొనటానికి ఆలస్యం చేసినకొద్దీ కలవరపాటు అధికం అవుతూ ఉంటుంది.

చిన్న ఆపరేషను ఏదయినా చేసుకొనాలనుకోండి. చేసుకుందామా వద్దా అనే సందేహం మన మానసికాందోళనని అధికం చేస్తుంది!

అందుకనే ఇటువంటి విషయాలలో శీఘ్రనిర్ణయం మంచిది. శస్త్రచికిత్స ఎన్నో చిక్కులని రానివ్వకుండా చూస్తుంది.

దైనిక సమస్యల సంగతికూడా అంతే. భోజనానికి వంట ఏమి చెయ్యాలి, ఒక ఆహ్వానం స్వీకరిద్దామా వద్దా, ఏసినిమా చూడాలి —ఇటువంటివిగూడా ఎన్నో ఆందోళనలకి దారితీస్తాయి కొందరికి. తప్పునిర్ణయం ఎక్కడ చేస్తామో అనే భయంతో జీవితమంతా బాధ



పడుతూ ఉంటారు. కోపంఎక్కువ అయి చిన్నచిన్న రోగ లక్షణాలు కూడా కనిపిస్తాయి!

హెచ్. ఎల్. హార్షెన్‌సోన్

(కాపీరయిటు)